ఇస్తినమ్మ వాయనం.. పుచ్చుకుంటినమ్మ వాయనం



వాయనాలు ఇచ్చిపుచ్చుకుంటున్న మహిళలు



అట్లతదియ జరుపుకుంటున్న మహిళలు

● నగరంలో వైభవంగా అట్లతదియ

ఒంగోలు మెట్రో: తెలుగువారి ముఖ్యమైన పండుగల్లో అట్లతద్ది లేదా అట్ల తదియ కూడా ఒకటి. ఆశ్వయుజ బహుళ తదియను అట్ల తద్ది పేరుతో జరుపుకుంటారు. 'అట్లతద్దె ఆరట్లు.. ముద్దపప్పు, మూడట్లు అంటూ ' ఆడ పడుచులకు బంధువులకు ఇరుగుపొరుగులకు వాయనాలు ఇస్తుండటం ఆనవాయితీ. సాయంత్రం సమయంలో వాయనాలు, నైవేద్యాలు పూర్తి చేసి, గోపూజకు వెళ్లి, అటు నుంచి చెరువులు, కాలువల్లో దీపాలను వదలి, చెట్లకు ఊయల కట్టి ఊగుతారు. పెళ్లీడుకొచ్చిన ప్రతి ఆడపిల్ల కాబోయే భర్త గురించి, వైవాహిక జీవితం గురించి కలలు కనడం సహజం. ఆ కలలు నెరవేరాలని ఎన్నో వ్రతాలు, నోములు చేస్తుంటారు. ఏటా జరుపుకునే అట్లతద్ది నోము అందులో ముఖ్యమైంది. ఒంగోలు నగరంలో అట్లతద్ది నోమును మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు వారి నివాస గృహాల్లో గురువారం ఉదయం సూర్యోదయం నుంచి సాయంత్రం సూర్యాస్తమయం వరకు ఉపవాసం ఉండి రాత్రికి శివపార్వతులను గౌరీ దేవిని గణపతి పూజ క్రతువులను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారికి కుడుములు, అట్లు, నైవేద్యంగా సమర్పించారు. అనంతరం ముత్తైదువులకు అట్లను వాయినంగా ఇచ్చారు. ఇస్తినమ్మ వాయనం.. పుచ్చుకుంటినమ్మ వాయనం. అందించానమ్మ వాయనం.. అందుకున్నానమ్మ వాయనం అంటూ మహిళలు తమ సౌభాగ్యం కోసం అట్లతద్ది పండగను జరుపుకున్నారు.

కాస్త ముఖం కడుక్కొని వెళ్లండి డ్రైవరన్నా!

● జిల్లా పోలీసుల వినూత్న కార్యక్రమం



లారీ డ్రైవర్ చేత ముఖం కడిగిస్తున్న పోలీసులు

ఒంగోలు టౌన్: మనసుంటే మార్గాలు అనేకం అనే సామెత ఉంది. నిన్నామొన్నటి వరకు అర్ధరాత్రి హైవేలపై వాహనాలను ఆపి మాముళ్లు వసూలు చేసిన పోలీసులే ఇప్పుడు డ్రైవర్లతో కాసేపు కబుర్లు చెప్పి ముఖం కడిగించి జాగ్రతగా వెళ్లిరా సోదరా అంటూ పంపిస్తున్నారు. ఈ మార్పు కారణం జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన వి.హర్షవర్ధన్ రాజు చేట్టిన ఫేస్‌వాష్ కార్యక్రమం. లారీలు, కార్లలో అర్ధరాత్రి ప్రయాణాలు ఇప్పుడు నిత్య కృత్యమైపోయాయి. గమ్య స్థానానికి త్వరగా చేరుకోవాలన్న తొందరలో ప్రమాదాలు జరుగుతున్నాయి. అతివేగం, తొందరగా వెళ్లాలన్న ఆత్రుత, మద్యం మత్తు, నిద్ర మత్తు కారణంగా నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అనుకోకుండా రోడ్డు ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోవడంతో ఆయా కుటుంబాలలో విషాదం నెలకొంటోంది. ఈ నేపథ్యంలో ఎస్పీ ఫేస్ వాష్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అర్ధరాత్రి జాతీయ రహదారులపై వెళ్తున్న కార్లు, లారీలు, ఇతరా వాహనాలను ఆపి డ్రైవర్లతో ముఖం కడిగించడం వంటివి పోలీసుల చేత చేయిస్తున్నారు. జాతీయ రహదారి, రాష్ట్ర రహదారుల్లో, ముఖ్యంగా ప్రమాదాలు జరిగే ప్రదేశాలల్లో, ఎక్స్, వై జంక్షన్లు, టోల్ గేట్ల వద్ద గత నెల రోజులుగా ఫేస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు 2200 మందికి పైగా ఫేస్ వాష్ చేయించామని పోలీసులు తెలిపారు. సురక్షితంగా ఇంటికి చేరుకున్న కొందరు డ్రైవర్లు ఫోన్లు చేసి థ్యాంక్యూ పోలీసన్నా అంటూ కృతజ్ఞతలు చెప్తుండటం తమకు సంతృప్తి కలిగిస్తోందని పోలీసులు వ్యాఖ్యనిస్తున్నారు.

జాతీయస్థాయి లేఖ రచన పోటీలు

ఒంగోలు వన్‌టౌన్: పోస్టల్ శాఖ నిర్వహించే డాయి అఖర్ జాతీయ స్థాయి లేఖ రచన పోటీలు 2025–26 సంవత్సరానికి నిర్వహిస్తున్నట్లు ప్రకాశం డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ మహమ్మద్ జాఫర్ సాదిక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉంటాయన్నారు. ఈ లేఖ రచన పోటీకి ప్రజలందరూ అర్హులేనని తెలిపారు. పోటీలు తెలుగు, ఇంగ్లిష్, హిందీ, రాజ్యాంగం గుర్తించిన ఏ భాషలోనైనా రాయవచ్చని తెలిపారు.

లేఖ రాయాల్సిన అంశాలు..

'లెటర్ టు మై రోల్ మోడల్'పై లేఖరచన పోటీలు ఉంటాయన్నారు. ఈ పోటీల్లో రెండు కేటగిరీలు ఉంటాయని, మొదటి కేటగిరీలో 18 ఏళ్లలోపు వారు, రెండో కేటగిరిలో 18 ఏళ్ల పైబడిన వారు పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ఎన్వలప్ కేటగిరీలో ఏ4 సైజు పేపర్లో 1000 పదాలు మించకుండా రాయాలన్నారు. ఇన్లాండ్ లెటర్ కేటగిరిలో ఇన్లాండ్ లెటర్ కార్డులో 500 పదాలు మించకుండా రాయాలన్నారు. విజేతలకు రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి రూ. 25 వేలు, ద్వితీయ బహుమతి రూ.10 వేలు, తృతీయ బహుమతి రూ 5 వేలు అందిస్తారన్నారు. జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి రూ.50 వేలు ద్వితీయ బహుమతి రూ.25 వేలు, తృతీయ బహుమతి రూ .10 వేలు ప్రదానం చేస్తారని తెలిపారు. ఇతర పూర్తి వివరాలకు దగ్గరలోని పోస్ట్ ఆఫీస్‌ను సంప్రదించాలని కోరారు. ఆసక్తి గల అభ్యర్థులు పైన తెలిపిన అంశంపై లేఖ రాసి 08 డిసెంబర్ 2025 లోపు సీనియర్ సూపరింటెండెంట్ అఫ్ పోస్టాఫీస్, ప్రకాశం డివిజన్, భాగ్యనగర్ 2 లైన్, ఒంగోలు 523001 పంపించాలని తెలిపారు.

శిలీంధ్రాల వృద్ధిపై అవగాహన కార్యక్రమం



శిలీంధ్రాల తయారీ గురించి రైతులకు వివరిస్తున్న వ్యవసాయ అధికారులు

సంతనూతలపాడు: ట్రైకోడెర్మావిరిడి, మైకోరైజాల శిలీంధ్రాలని నేలలో వృద్ధి చేసే విధానంపై గురువారం ప్రదర్శన క్షేత్రం నిర్వహించారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఒంగోలు ఆత్మ సౌజన్యంతో సంతనూతలపాడు మండలంలోని పి.తక్కెళ్లపాడు, చిలకపాడు, బొడ్డువారిపాలెం గ్రామాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి పి.పావని పాల్గొని మాట్లాడారు. ఈ ప్రదర్శన ద్వారా విత్తనశుద్ధి, నేలలో శిలీంధ్రం అభివృద్ధి చేసుకునే విధానం గురించి వివరించారు. ప్రతి రైతు 100 కేజీల పశువుల ఎరువు, 2 కేజీల వేప పిండి, ఒక కేజీ ట్రైకోడెర్మావిరిడి కలుపుకుని వారం నుంచి పది రోజుల పాటు గోనె సంచితో కప్పి ఉంచాలన్నారు. ఆ 100 కేజీల పశువుల ఎరువును నీడ ప్రదేశంలో ఉంచి ప్రతిరోజూ క్రమం తప్పకుండా ఉదయం, సాయంత్రం నీరు చల్లి పదునుగా ఉండేలా చూసుకోవాలన్నారు. వారం నుంచి పది రోజుల తర్వాత పశువుల ఎరువులో శిలీంధ్రం అభివృద్ధి చెంది ఆకుపచ్చ రంగులో ఆ 100 కేజీల పశువుల ఎరువుకు వ్యాప్తి చెందుతుందన్నారు. ఆ ఎరువును ప్రధాన పొలంలో పదును సమయంలో చల్లుకోవాలని, దీనివలన ప్రధాన పంటలో ఎండు తెగులు నివారించబడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆత్మ బీటీఎం కృష్ణ, వ్యవసాయ విస్తరణ అధికారి కె.వి.సుబ్బారెడ్డి, పి.తక్కెళ్లపాడు, చిలకపాడు, బొడ్డువారిపాలెం గ్రామాల వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా క్రీడా పోటీలు



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈఓ ఆంజనేయులు, పీడీలు



కబడ్డీ ఆడుతున్న బాలికలు



కబడ్డీ ఆడుతున్న బాలురు

మద్దిపాడు: మండల స్థాయి క్రీడా పోటీలు గురువారం గుండ్లాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎంఈఓ ఎంవీఆర్ ఆంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులు మానసికంగా ఉల్లాసంగా ఉండటానికి క్రీడా పోటీలు ఉపకరిస్తాయన్నారు. గెలుపోటములను పట్టించుకోకుండా అందరూ చక్కగా ఆడి మంచి ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. మండలంలోని ఆరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మద్దిపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు సుమారు 250 మందికిపైగా పోటీల్లో పాల్గొన్నారు. శుక్రవారం ఫైనల్స్ నిర్వహించనున్నట్లు మండల కో ఆర్డినేటర్ విజయ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు బి.జ్యోత్స్న, ఉపాధ్యాయులు, పలు పాఠశాలల పీడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజమ్మకు నాయకుల నివాళులు



గిరిజమ్మకు నివాళులర్పిస్తున్న వైవీ సుబ్బారెడ్డి, నాయకులు

కొత్తపట్నం: మండలంలోని ఈతముక్కల గ్రామంలో మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ కేశవరపు రామలింగారెడ్డి, ఆదినారాయణరెడ్డి కుటుంబాన్ని రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు గురువారం పరామర్శించారు. ఆదినారాయణరెడ్డి సతీమణి కేశవరపు గిరిజమ్మ పెద్దకర్మ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు, ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, పీడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ మాదాసి వెంకయ్య, రాష్ట్ర రైతు విభాగం జోనల్ ప్రెసిడెంట్ ఆళ్ల రవీంద్రరెడ్డి, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాలడుగు రాజీవ్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు దాసూరి గోపాల్‌రెడ్డి, వీరేపల్లి రామచంద్రారెడ్డి, కేశవరపు డాక్టర్ సుబ్బారెడ్డి గిరిజమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కాన్షీరాం సేవలు మరువలేనివి

ఒంగోలు వన్‌టౌన్: దేశానికి కాన్షీరాం చేసిన సేవలు మరువలేనివని బహుజన సమాజ్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరాం 19వ వర్ధంతి కార్యక్రమాన్ని ఒంగోలులోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు ఒంగోలు చిట్టిబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కాన్షీరాం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పి గురువయ్య, వీ తిరుమలకృష్ణ యాదవ్, ఎస్‌కె కాలేషా, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 13న మెగా జాబ్ మేళా

ఒంగోలు మెట్రో: ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్ శర్మ ఆధ్వర్యంలో గుంటూరులో డిసెంబర్ 13వ తేదీ శనివారం జాబ్‌మేళా జరగనుందని ఒంగోలు నగర బ్రాహ్మణ ప్రముఖులు గురువారం తెలిపారు. ఈసందర్భంగా జాబ్‌మేళాకు సంబంధించి కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు.

జాబ్‌మేళా డిసెంబర్ 13వ తేదీన ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు జరుగుతుందన్నారు. నవంబర్ 22వ తేదీ లోపల పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఐటీ, నాన్ ఐటీ, ఫార్మా, బ్యాంకింగ్, ఫైనాన్స్ వంటి సుమారు 50 కంపెనీలు హాజరవుతున్నాయని తెలిపారు. జాబ్ మేళాకు సంబంధించి పూర్తి సమాచారాన్ని 90305 36561, 99897 73451, 99497 22792 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

స్వామిత్ర సర్వే పరిశీలన

సంతనూతలపాడు: మండలంలోని గంగవరం రెవెన్యూ క్లస్టర్ ఏరియాలో గురువారం స్వామిత్ర సర్వేను ఎంపీడీవో డి.సురేష్‌బాబు పరిశీలించారు. గ్రామ పంచాయతీలో జి.టి.వ్యక్తరైజేషన్ వర్క్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో భూమి సారవంతం



నవధాన్యాల పైరును పరిశీలిస్తున్న జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సుభాషిణి

కొత్తపట్నం: నవధాన్యాలు సాగుచేయడం ద్వారా భూమి సారవంతమై ఖర్చు తగ్గడమే కాక అధిక దిగుబడులు వస్తాయని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వి.సుభాషిణి అన్నారు. రైతు సాధికార సంస్థ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ఆధ్వర్యంలో మోటుమాల గ్రామంలో రాధా సింగమనేని సాగుబడి చేస్తున్న నవధాన్యాల సాగు, కూరగాయలు, ఆకుకూరల పంటలను గురువారం పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ఆదాయ, వ్యయాలను అడిగి తెలుసుకున్నారు. మండల అగ్రికల్చర్ ఆఫీసర్ కిషోర్ బాబు మాట్లాడుతూ ప్రతి రైతు కూడా నవధాన్యాల సాగు చేసుకుంటే అన్ని రకాల పోషకాహారం అందించినవారవుతారని తెలిపారు. కార్యక్రమానికి ప్రకృతి వ్యవసాయం సిబ్బంది నరసింహులు, కొట్టం వికాస్‌రెడ్డి, రెడ్డప్ప, సురేష్ హాజరయ్యారు.

వైవీ సుబ్బారెడ్డిని కలిసిన చుండూరి



రాజ్యసభ సభ్యుడు వైవీ కలిసిన చుండూరి రవిబాబు, నాయకులు

ఒంగోలు సిటీ: రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని ఒంగోలులోని నివాసంలో ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు మర్యాద పూర్వకంగా గురువారం కలిశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే పార్టీ రాష్ట్ర కార్యదర్శి కసుకుర్తి ఆదెన్న, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు కేవీ. రమణారెడ్డి, వై.వెంకటేశ్వరరావు, బొట్ల రామారావు, ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, లీగల్‌సెల్ సభ్యులు ఒంగోలు మండల అధ్యక్షుడు మన్నే శ్రీనివాసరావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, కార్పొరేటర్లు ఇమ్రాన్‌ఖాన్, వెన్నపూస కుమారి, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి భూమిరెడ్డి రమణమ్మ, మహిళా నాయకులు ప్రమీల, వడ్లమూడి వాణి, మాధవి, బడుగు ఇందిర, నాయకులు, కార్యకర్తలు రాజ్యసభ సభ్యుడు వై.వీ. సుబ్బారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు.

నగరంలో మరో తురకపాలెం ?

● గురువారం ఒంగోలు నగరంలో బురద నీరు సరఫరా

● పట్టించుకోని నగరపాలక సంస్థ అధికారులు



రంగుమారిన నీరు



నీటి కుళాయిల ద్వారా వచ్చిన బురద నీరు

ఒంగోలు వన్‌టౌన్: అధికారుల అలసత్వం కారణంగా నగర ప్రజల ప్రాణాలు సంకటంలో పడ్డాయి. నగరంలో ఎటు చూసినా పారిశుద్ధ్య లేమి, కలుషిత జలాలు, కుక్కల బెడదతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. తాజాగా గురువారం ఒంగోలు నగరంలో అత్యంత అపరిశుభ్రంగా ఉన్న నీరు సరఫరా చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల గుంటూరులోని తురకపాలెంలో కలుషిత జలం, పారిశుద్ధ్య లేమి, ఇతరత్రా కారణాల వల్ల కాలనీలో మృత్యువాత చెందారు. ఇంతా జరుగుతున్నా కూడా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఒంగోలులోని రామ్‌నగర్, సంతపేట, అన్నవరప్పాడు, కబాడీపాలెం, క్లోపేట తదితర ప్రాంతాలలో మంచి నీటి లీకుల పేరుతో ఎడాపెడా తవ్వుతున్న మున్సిపల్ వాటర్ వర్క్స్ విభాగం వాటిని తిరిగి సరైన పద్ధతిలో పూడ్చడం లేదు. లీకులకు సరిగ్గా మరమ్మతులు చేపట్టకపోవడంతో మంచి నీరు తరుచూ కలిషతం అవుతున్నాయి. మంచి నీటి కుళాయిల ద్వారా బురద నీరు వస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతాల్లో ఎక్కువగా పేద వారు నివసిస్తుండటంతో వీరంతా మున్సిపల్ మంచి నీటి సరఫరాపైనే తాగు నీటికి ఆధార పడుతుంటారు. ఇటువంటి బురద నీటిని తాగితే దగ్గు, జలుబు, గొంతు నొప్పి, టైఫాయిడ్, న్యుమోనియా, పచ్చకామెర్లు వంటి వ్యాధులు వచ్చే ప్రమాదముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అధికారులు మంచీ నీటి పైపులైన్‌ల లీకేజిని సరి చేసి, బురద మంచి నీటి నుంచి విముక్తి ప్రసాదించాలని కోరుతున్నారు.

విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన అవసరం



విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న గ్రేస్ పుష్పరాగం

సంతనూతలపాడు: విద్యార్థులకు మానసిక, శారీరక ఆరోగ్యంపై అవగాహన అవసరమని కెరీర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ పి.గ్రేస్ పుష్పరాగం సూచించారు. మానసిక ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా సంతనూతలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మానసిక, శారీరక ఆరోగ్యంపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సర్వశిక్షా అభియాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రేస్ పుష్పరాగం పాల్గొని విద్యార్థులకు ఆరోగ్యకరమైన దినచర్య, ప్రశాంతమైన జీవనశైలి, బ్రేక్ ది స్టిగ్మా మైండ్ మేటర్స్ వంటి అంశాలపై సలహాలు, సూచనలు చేశారు. విద్యార్థులు పాల్గొని బ్రేక్ ది స్టిగ్మా మైండ్ మేటర్స్ అనే అంశంపై స్కిట్ ప్రదర్శించారు. స్కిట్‌లో మానసిక సమస్యలపై ఉన్న అపోహలను తొలగించడం, సహాయం కోరడంలో సంకోచం లేకుండా ఉండడం, మానసిక ఆరోగ్యాన్ని సమాన ప్రాముఖ్యతతో చూడడం వంటి సందేశాత్మక విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ఆరోగ్యమైన జీవన విధానాన్ని అలవర్చుకోవడం, మానసిక ఆరోగ్యంపై ఉన్న ప్రతికూల భావాలను రూపుమాపడం వంటి సానుకూల మార్పులు కలిగేలా చేయడం ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీఎస్టీతో మందుల భారం తగ్గుతుంది



జీఎస్టీ తగ్గింపుపై ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

కొత్తపట్నం: కేంద్ర ప్రభుత్వం మందులపై జీఎస్టీ తగ్గించడం సామాన్య ప్రజానికానికి ఇది ఎంతో ఉపయోగపడుతందని జిల్లా జీఎస్టీ ఆఫీస్ అధికారి టి.మల్లేశ్వరరావు అన్నారు. కొత్తపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న ఆశవర్కర్లు, ఏఎస్ఎంలు, మెడికల్ సిబ్బందితో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి హెచ్ఆర్‌డీ ఆఫీసు వరకు నినాదాలు చేసుకుంటూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లేశ్వరరావు మాట్లాడుతూ జీఎస్టీ తగ్గించడం వలన ప్రతి నెల వాడే మందులపై భారం తగ్గుతుందన్నారు. అరుదైన వ్యాధులు, అవయువ మార్పిడి వంటి చికిత్సలకు 36 ప్రాణ రక్షక మందులపై జీఎస్టీ పూర్తిగా రద్దు జరిగినట్లు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్, సైకాలజిస్ట్ ఏడుకొండలు, సోషల్ వర్కర్ అనిల్, సీహెచ్‌వో ఓంకారం, సూపర్‌వైజర్ పీహెచ్ఎస్ ఇందిరాదేవి, ఎంపీహెచ్ఎస్(ఎఫ్) సులోచనరాణి, ఆశావర్కర్లు, ఏఎస్ఎంలు, ఎమ్ఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అక్రమంగా బాణసంచా విక్రయిస్తే చర్యలు

సంతనూతలపాడు: మండల పరిధిలో ఎక్కడైనా అక్రమంగా బాణసంచా తయారు చేసినా, నిల్వ చేసి విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని సంతనూతలపాడు ఎస్సై అజయ్‌బాబు హెచ్చరించారు. సంతనూతలపాడు పోలీస్ స్టేషన్‌లో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు. దీపావళి పండుగ నేపథ్యంలో లైసెన్స్ లేకుండా బాణసంచా తయారీ, విక్రయాలు చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. పేలుడు పదార్థాలు నిల్వ చేసే సమయంలో కచ్చితంగా నిర్దేశించిన భద్రతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఎక్కడైనా అక్రమ నిల్వలు ఉంటే 91211 02132 నంబర్‌కు సమాచారం అందించాలని ఆయన సూచించారు.

సీజేఐపై దాడి చేయడం సిగ్గుచేటు

కొత్తపట్నం: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేయడం సిగ్గుచేటని రాష్ట్ర మాల ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు తుల్లుబిల్లి అశోక్ మండిపడ్డారు. గురువారం సాయంత్రం అల్లూరులో సీజేఐ గవాయ్‌పై దాడిని ఖండిస్తూ నిందితుడి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ సీజేఐపై జరిగిన దాడిని రాజ్యాంగంపైనే దాడిగా జరిగినట్టేనన్నారు. మాల జేఏసీ చైర్మన్ కొప్పోలు ఏడుకొండలు మాట్లాడుతూ ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేసిన వారిని వెంటనే శిక్ష వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాల జేఏసీ నాయకులు మేడిది రవికుమార్, మేడికొండ లక్ష్మణ్ నారాయణ, ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు, బి.రాజు, చక్రవర్తి, ఆదిశేషు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సామగ్రి బహూకరణ

చీమకుర్తి రూరల్: మండలంలోని పాటిమీదపాలెం గ్రామంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పూర్వ విద్యార్థి కూడలి బ్రహ్మేంద్ర త్రివేణి దంపతులు గురువారం విద్యా సామగ్రి అందజేశారు. వారి కుమారుడు పుట్టినరోజు సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో హెచ్ఎం శిలార్, ఉపాధ్యాయులు సంజీవి, విజయలక్ష్మి, కవిత, గ్రామస్తులు పాల్గొన్నారు.

శివాలయానికి రూ. 7 లక్షల విరాళం



చెక్కును అందజేస్తున్న దాత నరసింహారావు

ఒంగోలు మెట్రో: శివాలయానికి దాతలు విరాళాలం అందించారు. ఒంగోలు రంగారాయుడు చెరువు దగ్గర పునర్నిర్మాణంలో ఉన్న భువనేశ్వరి సహిత పశుపతేశ్వర శివాలయానికి ఒంగోలు వీఐపీ రోడ్డు రాజీవ్ నగర్లో నివాసం ఉంటున్న దాత చదలవాడ నరసింహారావు వారి భార్య కామేశ్వరి జ్ఞాపకార్థం రూ.7 లక్షల చెక్కును గురువారం ఉదయం ఒంగోలు బ్రాహ్మణ సేవా సమితి కార్యవర్గ సభ్యులకు అందజేశారు. ఈసందర్భంగా దాత చదలవాడ నరసింహారావును ఆ సంఘ సభ్యులు ఘనంగా సన్మానించారు.

అంగన్‌వాడీ చిన్నారులకు ప్లే కిట్ అందజేత



కిట్లు అందిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

మద్దిపాడు: ఐసీడీఎస్ మద్దిపాడు ప్రాజెక్ట్ పరిధిలోని 12 సెక్టార్లలో గల హబ్ అంగన్‌వాడీ సెంటర్లకు ఐటీసీ ప్రథమ్ వారి సహకారంతో 11 రకాల ప్లే మెటీరియల్ కిట్లును సీడీపీఓ పి.ఆర్. ఇవాంజిలిన్, ఐటీసీ ప్రథమ్ డిస్ట్రిక్ కో ఆర్డినేటర్ ఎస్.వెంకట్రావు చేతుల మీదుగా హబ్ అంగన్‌వాడీ టీచర్లకు గురువారం అందజేశారు. ఈ ప్లే కిట్లో మేజి గేమ్ పజిల్, గడియారం, జంతువుల అమరిక పలక, కూరగాయల అమరిక పలక, హ్యాండ్ పప్పెట్లు, ఫింగర్ పప్పెట్లు, జైలో ఫోన్, పూసలు, దారం, బాడీ పార్ట్స్ స్లేట్, యానిమల్ స్టిచ్చింగ్ స్లేట్, ఫజిల్స్, అసెస్మెంట్ టూల్ కిట్ వంటి ఆట వస్తువులు ఉన్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో 12 సెక్టార్ల సూపర్‌వైజర్లు, హబ్ అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి



గుడిపాడులో గార్బేజ్ కలెక్షన్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సురేష్‌బాబు

సంతనూతలపాడు: మండలంలో అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో డి.సురేష్‌బాబు సూచించారు. గురువారం గుడిపాడు గ్రామంలో డోర్ టు డోర్ గార్బేజ్ కలెక్షన్, సైడ్ కాలువలను పరిశీలించి సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీలో పరిశుభ్రత పాటించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ముమ్మరంగా పారిశుద్ధ్య కార్యక్రమాలతో పాటు తాగునీటి సమస్య రాకుండా చూడాలన్నారు. ప్రజలకు అన్ని విధాలా అవగాహన కల్పించి అందుబాటులో ఉండాలని తెలిపారు. వైద్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ఎంపీడీవో ఆదేశించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

ఒంగోలు డివిజన్

90102 24456, 90103 57744

90102 02762

Office mail : sakshiongads@gmail.com